www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 17 అక్టోబర్ 2024
5
చిత్తూరు

నేడు 'వాల్మీకి' జయంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
ఆశ్వయుజ పౌర్ణమి పురస్కరించుకుని గురువారం వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి రబ్బానీ బాష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలతో ఈ నెల 17న జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకునే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు

నేడు సెలవు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణ శాఖ వారి హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో ఈనెల 17వ తేదీ గురువారం చిత్తూరు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత యాజమాన్యాలు ఈ ఉత్తర్వులను విధిగా పాటించాలని కలెక్టర్ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో వేగంగా ముందస్తు చర్యలు

వర్షాల నేపథ్యంలో వరద నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్ మోహన్ ఆదేశానుసారం లోతట్లు నివాస ప్రాంతాలలో నీరు చేరకుండా నీవానది కాలువ పరివాహ ప్రాంతంలో యుద్ధ ప్రాతిపదికన హిటాచీలతో నీటి ప్రవాహానికి అడ్డులేకుండా పూడిక తీత, పిచ్చి మొక్కలను తొలగించిన అధికార యంత్రాంగం

కృష్ణాపురం డ్యామ్‌ను పరిశీలించిన అధికారులు

కార్వేటినగరం: మండలంలోని కృష్ణాపురం డ్యామ్‌ను బుధవారం ఎంపిడివో చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షులు చెంగలరాయల్ యాదవ్, తహశీల్దార్ భగవతి, సిఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజకుమార్, ఎఇ రవిప్రకాష్ పరిశీలించారు. తుపాన్ నేపథ్యంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎవరూ కూడా డ్యామ్ వద్దకు వెళ్ళకూడదని తెలిపారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.

పొలాల్లో చేరిన వర్షపు నీరు

విజయపురం: ఎడతెరిపిలేని వర్షంతో మండలంలోని పాతర్కాడు, ఇల్లత్తూరు పెద్దచెరువు, మహావీరపురం చెరువులు మొరవ పారుతున్నాయి. వరి పొలాల్లో వర్షపు నీరు చేసి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. చెరకు పంటలోను వరదనీరు చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిత్తూరు – తచ్చూరు హైవే రోడ్డు పనులలో భాగంగా వర్షపునీరు వెళ్లడానికి దారి లేకపోవడంతో కలియంబాకం వద్ద పంటపొలాలు చెరువును తలపిస్తున్నాయి. పంటనష్టం పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వర్షపు నీటిలో నగరిపేట

నగరి పట్టణ పరిధి నగరిపేట వర్షపు నీటిలో మునిగిపోయింది. ఇంటి చుట్టు వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. కొన్ని ఇళ్లలో వర్షపు నీరు చేరి బియ్యం, బట్టలు తడిచిపోయాయి. నగరిపేటలో మురికి కాలువ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లలేక ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. అధికారులు తమను ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షానికి బురదమయమైన రోడ్లు

బైరెడ్డిపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు బైరెడ్డిపలి నుంచి కడప నత్తంకు వెల్లే రోడ్డు గుంటలు ఏర్పడి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తోంది. ఇటీవల చాలామంది పాదచారులు, ద్విచక్ర వాహనదారులు గుంటల్లో పడి గాయాలపాలైన సంఘటనలు లేకపోలేదు. ఈ రోడ్డు పాతూరు నత్తం, పాతపేట, కుప్పనపల్లి, కడపనతం, టిఎన్.కుప్పం, గౌనితిమేపల్లి వ్యంగంవారిపల్లి, కడతట్లపల్లి గ్రామప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. గత ఐదేళ్లుగా ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి అవస్థలు పడక తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

కమిషనర్ నరసింహ ప్రసాద్

పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న నగర కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వర్షాల నేపథ్యంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గత మూడు రోజులుగా కురుస్తున్న మోస్తారు వర్షాలు, మరో రెండు రోజులు పాటు వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో నగరంలో పరిస్థితిని కమిషనర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కమిషనర్ నగరంలోని లోతట్టు ప్రాంతాలు, నీవానది పరివాహక ప్రాంతాల్లో పర్యటించి నీటి ప్రవాహాలను పరిశీలించారు. మేజర్ కాలువల్లో నీటిప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదే సమయంలో నీవానదిలో, పెద్దకాలువల్లో నీటి ప్రవాహాలకు ఇబ్బందులు లేకుండా జేసీబీలతో పూడిక, వ్యర్థాలు తొలగిస్తున్నారు. వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరుకు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో తీసుకున్న చర్యల పైనా సమీక్షించారు. నగరపాలక పరిధిలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉంటూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్పెక్టర్లు లోకానాథం, నరసింహ, ఏఈలు లోకేష్, రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటలపై తుపాన్ ప్రభావం

క్షేత్రస్థాయిలో పొలాల వద్దకు వెళ్ళండి
వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ

ప్రజాశక్తి- యాదమరి
క్షేత్రస్థాయిలో రైతుల పొలాల వద్దకు వెళ్లాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ వ్యవసాయ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పెరుమాలపల్లి గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు అందించారు. తుపాను ప్రభావంతో మూడు రోజులుగా పడతున్న వర్షాలకు నేలకొరిగిన వరి పంటను పరిశీలించి రైతులకు తగు జాగ్రత్తలు తెలిపారు. వర్షపునీరు పోలాల్లో నిలువకుండా బయటకు వెళ్ళడానికి కాలువలు తీసి, నిలచిన వర్షపునీటిని బయటకు పోయేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి చరిత, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సదుం : మండల పరిధిలో గత సోమ, మంగళవారము తుపాను ప్రభావంతో 34.0 మిల్లీమీటర్ల వర్ష పాతం మాత్రమే నమోదు అయిందని, బుధవారం ఉదయంకు 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని, తుపాన్ వలన ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం, పంటల నష్టం జరగలేదని మండల తహసీల్దార్ మారూఫ్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలో తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసి అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. వాగులు, వంకలు, చెరువులు, గార్గేయ నది వర్షం నీరుతో పొంగే పరిస్థితులు లేవన్నారు. మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్ బుధవారం అమ్మగారిపల్లి పంచాయతీ పరిధిలోని వరిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మండల పరిధిలో ప్రస్తుతం వరి 595 హెక్టార్లు, కొత్తగా వేసిన వేరుశనగ 4 హెక్టార్లు, ఉలవలు 111 హెక్టార్లు, కంది 4 హెక్టార్లు సాగులో ఉన్నట్లు తెలిపారు. పంట నష్టాలను దృష్టిలో పెట్టుకొని ఈ క్రాపింగ్ పూర్తి చేసామన్నారు.

యాదమరిలో నేలకొరిగిన రెండు ఎకరాల వరి పైరు, సోమల పంచాయతీలో మొలకలు వచ్చిన వేరుశనగ

చౌడేపల్లి: ఉద్యాన అధికారి సంతోషి కుమారి మండల పరిధిలోని కంభంవారిపల్లిలో ఉద్యాన పంటలను పరిశీలించారు. మామిడి, టమోటా, బంతిపూలు, చామంతి పూల పంటలను పరిశీలించారు. రైతులకు తగు సూచనలు సలహాలు అందించారు. ఇవ్వడం జరిగిందని ఆమె బుధవారం ప్రజాశక్తికి తెలిపారు.

రైతులకు తీవ్ర నష్టం

సోమల: సోమల మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని రైతులకు టమోటా, వరి, వేరుశనగ పంటలకు నష్టం వాటిల్లుతోంది. వరిపైరు వర్షం కారణంగా నేలకొరగగా, వేరుశనగ విత్తనాలు మొలకలు వచ్చి పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. టమోటా పంటలలో నీరు నిలిచిపోయి కాయలకు మచ్చలుపడి నష్టం కలుగుతోందని వాపోతున్నారు. పంటనష్టాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సాగుతున్న వంకలు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండప్రాంతాల నుంచి వర్షపునీరు వంకలకు చేరడంతో పలు ప్రాంతాలలోని వంకలు నీటితో ముందుకు సాగుతున్నాయి. కందూరు వంక, దేవలకుప్పం వంక, గార్గేయనది వర్షపు నీటితో సాగుతున్నాయి. చెరువులు నిండి మొరవలు పోతే ఈ ఏడు రైతులకు చెరువుల కింద సేద్యం చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని అంటున్నారు.

ఉద్యాన పంటను పరిశీలిస్తున్న చౌడేపల్లి ఉద్యాన అధికారి సంతోషి కుమారి

నీవా నది చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలి

ప్రజలకు రక్షణ కల్పించాలి: సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నడిబొడ్డున ఉన్న నీవానది చుట్టూ వేలాది మంది ప్రజల నివసిస్తున్నారని, గతంలో వరదల కారణంగా వేలాది మంది నష్టపోయినరని భవిష్యత్తులో అలాంటి పరిస్థితి లేకుండా ప్రహరీ గోడ నిర్మించి ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో నీవానది వద్ద నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వాడ గంగరాజు, జిల్లా నాయకులు కె.సురేంద్రన్ మాట్లాడుతూ అధికారులు, ప్రభుత్వం సమస్య వచ్చినప్పుడే కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని నీవానది చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ కల్పించే విధంగా శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తుపాను వలన ఎప్పుడు వరద వస్తుందోనని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అదేవిధంగా దుర్వాసనతో రకరకాలు వ్యాధులతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బయట ప్రాంతాల్లో వర్షాలు భారీగా పడితే నీవా నది తీవ్రస్థాయిలో ప్రవహిస్తుందని, చెత్తచెదారం బ్రిడ్జి వద్ద పేరుకుపోతుందని అప్పుడు స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు తూతూ మంత్రంగా బ్రిడ్జ్ దగ్గర మాత్రమే క్లీన్ చేశారని అలా కాకుండా కాలువ మొత్తం పూడికతీత తీయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలోని చిత్తూరు నగరంలో ఎలాంటి నష్టపరిహారం జరగకుండా కలెక్టర్ ఇతర అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న, సిపిఎం నాయకులు కాలనీవాసులు

అధికారులు అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే థామస్

కార్వేటినగరం: తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల శాఖ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాలకు ప్రజలకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూరి గుడిసెల్లో ఉన్న కుటుంబాలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ భగవతిని ఆదేశించారు. అధికారులకు ఏమైనా సమస్యలు ఉంటే సమాచారం అందించాలన్నారు. పార్టీ అధ్యక్షులు చెంగలరాయల యాదవ్, నియోజకవర్గం బీసీ సంఘం అధ్యక్షులు రవి యాదవ్, ఏఈలు రవిప్రకాష్, గిరీష్, భాస్కర్‌రాజు, ఇంచార్జ్ ఈవోపిఆర్‌డి నాగరత్నమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రాన్ని సందర్శించిన ఎస్ఈ

ప్రజాశక్తి- యాదమరి: విద్యుత్ శాఖ ఉపకేంద్రాన్ని చిత్తూరు జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇస్మాయిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గాంధీ రోడ్డులోని విద్యుత్ ఉపకేంద్రాన్ని ఎస్ఈ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ముని చంద్ర, డిప్యూటీ డివిజనల్ ఇంజనీర్‌తో కలిసి పరిశీలించారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందువలన విద్యుత్ సరఫరాలో ఎలటి అంతరాయం లేకుండా వినియోగదారులకు అందించాలని సిబ్బందికి సూచించారు.

విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ ఇస్మాయిల్

ప్రజాశక్తి వార్తకు స్పందన

సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు
మురుగునీరు ఇలా... అరికట్టేది ఎలా...? అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. ఎంపిడిఓ హరిప్రసాద్ రెడ్డి బుధవారం మండలంలోని తూగుండ్రం గ్రామానికి వెళ్లి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని పరిశీలించారు. మురుగు రోడ్డుపైకి రాకుండా కాలువలు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ఈ విషయమై పై అధికారులతో చర్చించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యువరాజ్, బోస్, ఫీల్డ్ అసిస్టెంట్ కర్ణ ఉన్నారు.

మురికి నీరు ప్రవహిస్తున్న వీధిని పరిశీలిస్తున్న ఎంపీడీవో

మా ఊళ్లో.. మద్యం షాపు వద్దు..

వైన్‌షాపు ఎదుట మహిళల నిరసన

మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ రాస్తారోకో చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరంలోని బస్‌స్టాప్ సమీపంలో మద్యంషాపు ఏర్పాటును నిరసిస్తూ గిరింపేట మద్యం షాపు వద్ద మహిళలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం మహిళా విభాగం నాయకురాలు వరలక్ష్మి మాట్లాడుతూ గిరింపేటలో కేటాయించిన మద్యం షాపును బస్‌స్టాప్ సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మరో ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేలూరు– తిరుపతి జాతీయ రహదారిపై మహిళలు బైఠాయించి నిరసన తెలపడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. టూ టౌన్ సీఐ నెట్టికంటయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మహిళల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మద్యం షాప్ యజమానితో చర్చించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని సిఐ సూచించారు.

కార్వేటినగరం : మండల పరిధిలోని కొల్లగుంట ఆది ఆంధ్ర దళితవాడలో కొత్త వైన్‌షాప్ ప్రారంభోత్సవం వద్దంటూ మహిళలు వర్షంలో ధర్నా చేశారు. మా గ్రామంలో వైన్‌షాప్ వద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మందు బాబులు మద్యం తాగి గ్రామంలో చొరబడతారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇక్కడ వైన్‌షాప్ పెట్టాలని చూస్తే గ్రామస్తులు అడ్డుకున్నారని తెలిపారు. వైన్ షాప్ వద్ద వర్షంలో గంట పాటు మహిళలు నిరసన తెలిపారు. ఎస్సై రాజకుమార్ సర్దిచెప్పి ఇక్కడ వైన్‌షాప్ పెట్టకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

నివాసాల మధ్య వైన్‌షాపులు వద్దు.. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరు అర్బన్: ప్రస్తుత ప్రభుత్వం వైన్‌షాపులను లక్కీ డ్రిప్పు పద్ధతుల్లో కేటాయిస్తే వచ్చిన వారు నివాసాల మధ్య వైన్ షాపులు పెట్టడం దారుణమని, వెంటనే వాటిని దూరప్రాంతాలకు తరలించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చింది. షాపులు దక్కించుకున్న యజమానులు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాల్లో పెట్టడంతో జిల్లాల అనేక చోట్ల నిరసనలు వెల్లువెత్తాయని తెలిపారు. మద్యం షాపులు దక్కించుకున్న వారు ప్రజల నివాసాల మధ్య కాకుండా ఊరి బయట వైన్‌షాపులు పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మద్యాన్ని అరికట్టతామని చెప్పి ఇప్పుడు స్వయంగా ప్రభుత్వమే టెండర్ల రూపంలో నిర్వహించడం దారుణమన్నారు. తక్కువ రేటుకే ఇస్తామని చెప్తున్నా ఎక్కువమంది తాగండి అనే పద్ధతులు ప్రోత్సహించినట్టు ఉందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలను ఇబ్బంది పెట్టకుండా మద్యాన్ని అరికట్టాలని కోరారు. జిల్లా అధికారులు, ఎక్సైంజ్ అధికారులు స్పందించి వైన్‌షాపులు ఊరు బయట పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..?

ప్రభుత్వాలు మారుతున్న ... మండలంలో రోడ్డు పరిస్థితి మాత్రం ఏ మాత్రం మారడం లేదు.. గుడియాత్తం-చిత్తూరు అంతర్రాష్ట్ర రహదారి... యాదమరి మండల కేంద్రం జోడి చింతల నుండి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా తయారయ్యింది. పది కిలోమీటర్ల మేర అడుగుకో గుంత.. వాహనచోదకులు ఈ దారి గుండా ప్రయాణించాలంటే బెంబేలెత్తిపోతున్నారు. ముందుకు సాగలేక వెనుక్కు రాలేక నానా అవస్థలు పడుతున్నారు.

- ప్రభుత్వాలు మారినా.. మారని రోడ్ల స్థితి..
- అధ్వానంగా అంతర్‌రాష్ట్ర రహదారి
- 10 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
- నిద్రావస్థలో అధికారులు

జోడి చింతల వద్ద అధ్వానంగా రోడ్లు

ప్రజాశక్తి- యాదమరి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిత్తూరు –గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి చెరువును తలపిస్తోంది. జోడిచింతల వద్దనున్న పోలీస్‌స్టేషన్ నుంచి తమిళనాడు సరిహద్దు కనికాపురం వరకు అడుగుకో గుంత ఉండటంతో ఈ దారిలో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఈగుంతల్లో వర్షపు నీరు నిండి ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాల భారిన పడుతున్నారు. ఇక రాత్రి సమయాల్లో అయితే వారి దుస్థితి చెప్పనక్కర్లేదు. ప్రతిరోజు వాహనదారులు ఈ దారిలో ప్రయాణించేటప్పుడు తమ ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొన్నది. రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈరహదారి గుండా నిత్యం వాహనచోదకులు ప్రమాదాల భారినపడి హాస్పిటల్ పాలవుతున్నారు. మరి కొంతమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. నిత్యం ప్రయాణిస్తున్న వాహనాలు ఆ రోడ్లలో గుంతల్లో చిక్కుకుని ముందుకు వెనక్కి సాగలేక వాహనాలు మొరాయిస్తున్నాయి. ఏళ్లతరబడి ప్రజలు ఇంత ఇబ్బంది పడుతున్నా అటు ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రోడ్డు ఇంత అధ్వానంగా తయారైందని పలుమార్లు ప్రతికల్లో ప్రచురితమైనా.. పలువురు నిరసనలు తెలిపినా ఇప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదు.. ఇక ఈరోడ్డును ఎప్పటికీ మరమ్మతులు చేపడతారని వేచి చూడాల్సిందే..

చిత్తూరు- బెంగళూరు అంతర్రాష్ట్ర రోడ్డుపై నీరు నిలిచి ఉన్న దృశ్యం

కసిరాల కొత్తూరు వద్ద భారీ గోతుల్లో రోడ్డుపై నీరు నిలిచిన దృశ్యం

ఏరియా ఆసుపత్రిలో కడా పీడీ తనిఖీలు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం కడా పిడి వికాస్ మర్మత్ సందర్శించారు. ఆసుపత్రి వైద్యులను పలు అంశాల పై ఆరా తీశారు. రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఆసుపత్రిలోని సౌకర్యాల గురించి రోగుల వద్ద విచారించి, ఆసుపత్రి అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరం సచివాలయన్ని జిల్లా పంచాయతీ అధికారిణి పార్వతమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తుపాన్ ప్రభావంపై ఈవో నాగరత్నమ్మను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీవోని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓ నాగరత్నమ్మ, సర్పంచ్ ధనంజయ వర్మ, బిల్ కలెక్టర్ హరికృష్ణ, పలువురు ఉన్నారు.

నూతన విద్యార్థులకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- కుప్పంటౌన్: పీఈఎస్ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరానికి ప్రవేశం పొందిన విద్యార్థులకు కళాశాల ఆడిటోరియంలో మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ సురేష్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు నగరానికి డాక్టర్ విశాల్ రావు, డాక్టర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కళాశాల డీన్, ప్రిన్సిపల్ డాక్టర్ కృష్ణారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిధులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. వైద్యవిద్యకు ఉన్న విశిష్టతను, ఆరోగ్య విషయంలో వైద్యుల పాత్రను, బాధ్యతలను వివరించారు. అనంతరం 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం నాయునూరు గ్రామంలో నూతన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ బుధవారం ప్రారంభించారు. గ్రామ టిడిపి అధ్యక్షులు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటు ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామపరిధిలో టిడిపి జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఎమ్మెల్సీ సహకారంతో గ్రామపరిధిలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల పాత భవనానికి మరమ్మతులు చేయించి, అందులో సచివాలయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మురుగేష్, వార్డు సభ్యులు మురళి, రాజా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి- యాదమరి: యాదమరి ఉన్నత పాఠశాలలో బుధవారం అండర్-17 ఫెన్సింగ్ బాలబాలికల ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభించినట్లు జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి వసంతవాని తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో జరగబోవు 68వ రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు వ్యాయామఉపాధ్యాయులు రవి ఆధ్వర్యంలో జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి రాజా, పిడిలు సెల్వ పాండియన్, కృష్ణయ్య, సిరాజ్ అహమ్మద్, బాబు, శరత్, నూర్ మొహమ్మద్, ఉమాపతి, శాప్ కోచ్‌లు రవి, కార్తిక్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి- విజయపురం (నగరి): సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడలో జాతీయస్థాయిలో ప్రతిభచూపి స్టార్ ఆఫ్ ఇండియా సాధించిన క్రీడాకారుడు కేసీ తేజేష్‌ను, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనభరచి బెస్ట్ అప్‌కమింగ్ ప్లేయర్ అవార్డు సాధించిన లక్ష్మీ నరసింహారెడ్డిని, సబ్‌జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయిపోటీలో ప్రతిభ కనభరచిన భానుప్రకాష్, ఇజాజ్, రిత్విక్, సిద్దిక్‌లను మాజీ మంత్రి ఆర్కేరోజా ప్రశంసించారు. బుధవారం తన స్వగృహానికి క్రీడాకారులను రప్పించిన ఆమె జాతీయస్థాయిలో ప్రతిభ చాటినందుకుగాను వారిని అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్స్ వితరణ

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో చంద్రగిరి పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు టీడీపీ మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు సహకారంతో ఈశ్వర్ ట్రేడర్స్ అధినేత మునిరత్నం రాయల్ రెయిన్ కోట్స్ పంపిణీ చేశారు. చంద్రగిరి పంచాయతీలు పారిశుధ్య కార్మికులు వర్షానికి తడవకుండా పారిశుధ్య పనులు చేయడానికి వీలుగా సర్పంచ్ రూప ఆధ్వర్యంలో 30మందికి రెయిన్ కోట్స్ అందజేశారు. కార్మికులందరూ రెయిన్ కోట్స్ ధరించి తమ విధులు నిర్వహించారు. వర్షాకాలంలో తమ బాధలను గుర్తించి కోట్స్ అందజేసినందుకు ఈశ్వర్ ట్రేడర్స్ అధినేత మునిరత్నం రాయల్‌కి, సర్పంచ్ రూపాకు పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరుస్తున్న ఎంపీడీవో కార్యాలయం

ప్రజాశక్తి- విజయపురం: రెండు రోజులుగా కురిసిన వర్షానికి మండల కార్యాలయం తడిచి ముద్దైయింది. మిద్దెపై నీరు నిలిచి పాచిపట్టి ఉండటంతో నీరాంత గోడల్లోకి చేరి ఉరుస్తోంది. వానకు ఎంపీడీవో కార్యాలయంలో గదులు తడిచి గోడలు బీటలు బారింది. ఇక ఎంపీపీ చాంబర్ గదిలో మరీ దారుణంగా ఉరుస్తోంది. మీటింగ్ హాల్ కూడా వర్షానికి పూర్తి తడిచిపోయింది. కార్యాలయంలో ఇంత ఉరుస్తున్నా కూడా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శించారు. వచ్చిన నిధులను ఏం చేస్తున్నారని మండల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని బాగుచేయాలని కోరుతున్నారు.

సచివాలయంలోకి వర్షపునీరు

వెదురుకుప్పం మండలం పాత గుంట గ్రామంలోని సచివాలయం భవనంలో వర్షపునీరు చేరాయి. సచివాలయ భవనం పాత భవనం కావడంతో గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనంలోని గోడల నుంచి వర్షపు నీరు నిల్వ చేరుతున్నాయి. భవనం ఉరుస్తుండటంతో భవనంలోని రికార్డులు సైతం తడిసి ముద్దవుతున్నాయి. దీంతో నియోజకవర్గ జనసేన నాయకులు ఈతేశ్వర్‌రెడ్డి, గ్రామస్తులతో కలిసి సచివాలయంలోని నీటిని బయటకు తోడే ప్రయత్నం చేశారు. కొత్త సచివాలయ భవనం నిర్మాణం పూర్తి అయినా పరిపాలన అక్కడి మార్చలేదని, పాతభవనంలోనే కొనసాగిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కొత్త భవనంలోకి సచివాలయాన్ని మార్చాలని కోరుతున్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని 18 గ్రామ పంచాయతీలోని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డుసభ్యులకు రెండు రోజుల శిక్షణా తరగతులు బుధవారం చివరిరోజు స్థానిక వెలుగు కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి తాజ్ మస్రు ఆధ్వర్యంలో నిర్వరహించారు. ఈసందర్భంగా గ్రామపంచాయతీల్లో చేపట్టవల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, వారివారి విధుల నిర్వహణ గురించి తెలియజేశారు. ఈఓపిఆర్‌డి సద్గుణ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

విజయపురం (నగరి) : నగరి మండలంలోని మండల పరిషత్ ఆఫీసులో జరిగిన శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిశాయని ఈవోపీఆర్‌డి అరుణ తెలిపారు. పారిశుధ్యం, గ్రామపంచాయతీల్లో చేపట్టవల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వార్డుమెంబర్లు, ఉప సర్పంచులకు శిక్షణ ఇచ్చారు.

విగ్రహ ప్రతిష్టలో ఆర్కే రోజా

ప్రజాశక్తి- విజయపురం (నగరి): నగరి రూరల్ మండలం దేశూరు అగరం గ్రామంలో బుధవారం శ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారి నూతన ఆలయ అష్టబంధన, విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేక మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్‌కె.రోజా పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అర్చన, హారతి తీర్థప్రసాదాలతో పూజారులు ఆశీర్వదించారు.

పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ స్కూల్స్‌ను అభివృద్ధి చేయండి: కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాలో పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ స్కూల్స్ కింద ఎంపిక కాబడ్డ మొత్తం 40 పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విద్యాశాఖ అధికారులతో పాటు సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ స్కూల్స్ కింద ఎంపికైన పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి సంబంధిత జిల్లా అధికారులు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఎస్‌హెచ్‌ఆర్ఐ స్కూల్స్ కింద మొత్తం జిల్లాలో 40 పాఠశాలలు ఎంపిక కాగా ఇందులో మొదటి విడతలో 30 పాఠశాలలు, రెండవ విడతలో 10 పాఠశాలలు ఉన్నాయని, మొదటి విడతలో ఎంపికైన 30 పాఠశాలల్లో సివిల్ వర్క్సులో భాగంగా ఆటస్థలాల అభివృద్ధి, మరొక అంశంగా ల్యాబ్స్ అభివృద్ధి చేయడం జరుగుతున్నదని తెలిపారు. సివిల్ వర్క్సును నాణ్యతతో పూర్తి చేయాలని, పూర్తి అయిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్‌లను పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకురావాలన్నారు. ఈ విషయంలో ఏపిఈడబ్ల్యూఐడిసి, ఎంఈఓలు, హెచ్‌ఎంలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపిక కాబడ్డ పాఠశాలలలో ఉపాధ్యాయులకు కార్వేటినగరం డైట్ ద్వారా శిక్షణ నిర్వహించాలని అన్నారు. ఆర్‌ఓ ప్లాంట్‌ల మరమ్మతులకు సంబంధించి స్కూల్ మేనేజ్మెంట్ ఫండ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సమగ్రశిక్ష ఏపిసి వెంకట రమణారెడ్డి, చిత్తూరు డివైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

తక్కువ నీటితో పంటల దిగుబడి: జెసి విద్యాధరి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: డ్రిప్ ద్వారా తక్కువ నీటితో పంటల దిగుబడి సాధించవచ్చని జెసి విద్యాధరి తెలిపారు. బుధవారం మండలంలోని నలగాంపల్లిలో రైతు రాజేంద్రనాయుడు మామిడి తోపును జెసి పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఉద్యానవనాలను డ్రిప్పుల ద్వారా సాగు చేయాలని, దీనివలన నీటి సాంద్రత మిగులు ఉంటుందన్నారు. అదేవిధంగా చెట్లకు మిశ్రమం చేసే ఎరువులను కూడా డిప్పుల ద్వారా మిశ్రమం చేసి చెట్లకు మొదలుకు అందించడం ద్వారా చెట్లు వృద్ధిచెంది పంట దిగుబడి అత్యధికంగా వస్తుందన్నారు. జెసి వెంట ఏపీఎంఐ పిడి బాలసుబ్రమణ్యం, తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఉద్యానవన శాఖాధికారి సాగరిక, వ్యవసాయ అధికారి చిట్టిబాబు, జైన్ కంపెనీ సిబ్బంది అనిల్ పాల్గొన్నారు.

వర్షంలోనూ శ్రీవారిమెట్టు వ్యాపారుల నిరసన దీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శ్రీవారి మెట్టు వ్యాపారస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని గత 57 రోజుల నుంచి టిటిడి పరిపాలనా భవనం వద్ద నిరసన దీక్ష చేస్తూనే ఉన్నారు. వర్షాలను సైతం లెక్కచేయకుండా 31 కుటుంబాల వారు దీక్షలు చేస్తుంటే కనీసం ఈవో స్పందించకపోవడం బాధాకరమన్నారు. టిటిడి స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, గంగులప్ప, శ్రీవారి మెట్టు వ్యాపారులు యుగంధర్, చిట్టిబాబు, మధు, చిరంజీవి, పెంచలయ్య, ప్రకాష్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి

- డాక్టర్ ఉమామహేశ్వర రావు సూచన
- సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఘనంగా పట్టభద్రుల దినోత్సవం

ప్రజాశక్తి-రామచంద్రాపురం: విద్యార్థులు విద్యాభ్యాస సమయంలోనే తమ లక్ష్యాల సాధన కోసం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శ్రీ పద్మావతి మహిళ మెడికల్ కాలేజ్ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యుక్త వయసులోనే మంచి ఆలోచన పరిజ్ఞానంతో ముందుకు సాగితే బంగారు భవిష్యత్తును పొందవచ్చు అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన శ్రీ వేద నారాయణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ దినకర బాబు మాట్లాడుతూ నేటి సమాజం సాంకేతిక పరిజ్ఞానం వైపు నడుస్తుందని, ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలన్నారు. సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం వివిధ విభాగాలలో ప్రతిభ కనబరిచిన పట్టభద్రులకు గాడ్యుయేషన్ పట్టాలు, నగదు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుమలత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ పట్టాలను అందిస్తున్న ఉమా మహేశ్వరరావు

క్రైం న్యూస్

ట్రాన్స్‌ఫార్మర్లు గోడౌన్ దగ్ధం కేసులో ఎంపీపీకి రిమాండ్

ప్రజాశక్తి- యాదమరి: మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసి.విజయానంద రెడ్డి చిత్తూరు నగరంలో గిరింపేటలో ప్రచారం చేస్తుండగా గుర్తు తెలియని కొందరు టపాకాయలు పేల్చడంతో ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు ఎగిరి ట్రాన్స్‌ఫార్మర్లు నిల్వ ఉన్న గోడౌన్లో పడి ట్రాన్స్‌విద్యుత్ ఉపకరణాలు, ట్రాన్స్ ఫార్మర్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ సంఘటనలో విద్యుత్ శాఖకు సుమారు రూ.2 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై విద్యుత్‌శాఖ డీఈ ఫిర్యాదుతో చిత్తూరు టూ టౌన్ సిఐ నెట్టికంట్టయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. మంగళవారం రాత్రి ఘటనకు కారణమైన ఎంపీపీ సురేష్ బాబును అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

రెండు కార్లు ఢీ- నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- శాంతిపురం : కుప్పం- పలమనేరు జాతీయరహదారిలోని తుమిసి రోడ్డు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అరగొండకు చెందిన మురళి, రాజేశ్వరి దంపతులు, వారి కుమారుడు భగవంత్‌కు కుప్పం పిఎస్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరంలో చేర్చేందుకు కారులో వెళుతుండగా కుప్పంకు చెందిన మరోవ్యక్తి వీకోట వెళుతుండగా మార్గమధ్యంలోని తుమిసి రోడ్డు వద్ద రెండు కార్లు ఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో భగవంత్, మురళీ, రాజేశ్వరితో పాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు 108 ద్వారా కుప్పం పిఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం పట్టణం పాతపేట గాంధీ రోడ్డులో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలవరం రేపింది. స్థానికుల కథనం మేరకు మృతుడు పట్టణ పరిధిలోని బైరుగానిపల్లి ప్రాంతానికి చెందిన చాంద్ (23)గా గుర్తించారు. సమాచారాన్ని పోలీసులకు అందించారు. డిఎస్పి పార్థసారథి, పట్టణ సిఐ జిటి.నాయుడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతుడి మరణానికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

నూతన మద్యం షాపు ప్రారంభం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండల కేంద్రమైన ఎస్ఆర్ పురంలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన వైన్‌షాపును గంధమనేని జయశంకర్ నాయుడు ప్రారంభించారు. మండలంలోని మద్యం దుకాణం వద్దకు మద్యం ప్రియులు చేరుకొని సంతోషాన్ని వ్యక్తపరిచారు. మాజీ సర్పంచ్ మోహన్ నాయుడు, జలేంద్రనాయుడు, యువత ప్రధాన కార్యదర్శి బాబు, చిన్నపరాజు అప్పలరాజు శ్రీహరిరెడ్డి నిరంజన్ రెడ్డి, చిన్నస్వామి రెడ్డి, మూల్లూరు సుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు: సిఐ

కుప్పం టౌన్: ప్రభుత్వ నూతన మద్యం పాలసీ ప్రకారం లాటరీ ద్వారా దుకాణం అనుమతులు పొందిన వారు దుకాణాలు ప్రారంభించుకోవచ్చని కుప్పం ఎక్సైజ్ సీఐ నాగరాజా తెలిపారు. మద్యం దుకాణాల వద్ద మద్యం తాగడానికి అనుమతి లేదని, అలాగే దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే మద్యం విక్రయించాలని, ప్రతి దుకాణంలో ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ నియమాలను అధిగమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

18-20 తేదీల్లో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ పర్యటన

తిరుపతి టౌన్ : జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఈనెల 18-20 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనుందని కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో 'ది ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండ్ రీహాబిలిటేషన్ యాక్ట్, 2013' అమలును సమీక్షించనున్నారు. 19న ఉదయం తిరుమల శ్రీవారిని విఐపి బ్రేక్ దర్శనం చేసుకుంటారు. అనంతరం తుడాలో, రుయాలోనూ సమావేశం అవుతారు.

సమస్యలు పరిష్కరించడానికే 'పల్లె పండుగ'

ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం రూరల్: ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నెరవేరుస్తామని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం కుప్పం మండలపరిధిలో గరిగచినేపల్లి, పెద్దబాంగారునత్తంలో పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటు ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్.మునిరత్నం, నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబు హాజరయ్యారు. గరిగచినేపల్లి ఎస్సీ కాలనీలో ప్రభుత్వం అమలు చేస్తున్న గోకులం షెడ్డు పథకంలో భాగంగా నూతన ఆవుల షెడ్డును ఎమ్మెల్సీ ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో నిరుద్యోగ నిర్మూలనకు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఏడు పరిశ్రమలు స్థాపించడానికి పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం జరిగిందన్నారు. త్వరలో పరిశ్రమలు స్థాపిస్తామని, అత్యధికంగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు.

రూ.52లక్షలతో సిసి రోడ్డు

బంగారుపాళ్యం: మండలంలోని తుంబ కుప్పం, సదకుప్పం, నలగంపల్లి, మంగళపల్లి పంచాయతీలలో ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో పల్లెల పండుగ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.52 లక్షలతో సిమెంట్ రోడ్లను ప్రారంభించామని తెలిపారు. సర్పంచ్ లీలావతి, టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ జయచంద్ర నాయుడు, కోదండ యాదవ్, సూరి నాయుడు, భరణి, ధరణి, రాధాకృష్ణం నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌పురంలో..

పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న కుప్పంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీ మోహన్

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఎస్ఆర్ పురం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్, ప్రభుత్వ సహకారంతో ఒడ్డుపల్లె, ఈ కేకండిగా పంచాయతీలలో మంజూరైన పాఠశాల ప్రహరీ నిర్మాణం, సిమెంట్ రోడ్లు బుధవారం ఎంపీడీవో మోహన్ మురళి, సర్పంచులు, ప్రజాప్రతినిధులు భూమిపూజ నిర్వహించారు. మాజీ ఎంపిటిసి వేమన నాయుడు, కెఎం.రవి, ఏపీవో చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రేఖ, నౌషాద్, అసిస్టెంట్ ఇంజనీర్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విజయపురం: మండలంలోని సామిరెడ్డికండ్రిగ, మల్లారెడ్డి కండ్రిగ పంచాయతీలో పల్లెపండుగ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. సామిరెడ్డి కండ్రిగలో సిమెంట్ రోడ్డుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సోమల: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెండు పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. సోమల పంచాయతీ అడుసుపల్లి, బుంగావారిపల్లి, ముండ్రివారిపల్లి, నంజంపేట పంచాయితీ సరస్వతీపురం, పొదలగుంటపల్లి, ఎస్.నడింపల్లి పంచాయతీలలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసినట్లు ఉపాధి హామీ ఏపీఓ దినకర్ బాబు తెలిపారు. ఈపనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

శాంతిపురం: మండల పరిధిలోని 30 సొన్నెగానిపల్లి, దండికుప్పం, కొలమడుగు, శివరామపురం, అబకలదొడ్డి పంచాయతీలలో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కింద పలు అభివృద్ధి పనులకు భూమిపూజ, నూతన సీసీ రోడ్డుకు భూమిపూజ చేసి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథ్ నాయుడు, ప్రధాన కార్యదర్శి పివి.నాగరాజు, జనార్ధన్‌రెడ్డి, ఉయ్యాల జయరామ్ రెడ్డి, చలపతి, శివ, అనసూయ, జనసేన సమన్వయకర్త నరేష్ పాల్గొన్నారు.

విజయపురంలో..

నీటితొట్టిలో పడిన ఎద్దు

కాపాడిన స్థానిక యువత

ప్రజాశక్తి- చౌడేపల్లి: నీటితొట్టిలో ఓ ఎద్దు పడి అవస్థలు పడడంతో గుర్తించిన స్థానికులు ఎద్దును కాపాడారు. పట్టణంలోని బజారు వీధికి చెందిన నాగరాజు ఎద్దు వర్షం కారణంగా మాజీ ఎమ్మెల్యే కెవి.పతి ఇంటికి సమీపంలో గడ్డిమేస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడింది. గుర్తించిన కొందరు యువకులు రక్షించే ప్రయత్నం చేస్తుండగా పక్కనే ఉన్న నీటి సంపులోకి పడిపోయింది. దీంతో జెసిబి సాయంతో స్థానికులు ఎద్దును సురక్షితంగా వెలుపలికి తీశారు.

IN THE COURT OF THE PRL CIVIL JUDGE (JUNIOR DIVISION) OF CHITTOOR

O.S.No. 482 of 2015

Betveen :
V.Yasodha ...Plaintiff
And
B.Giri Babu & 5 others ... Defendants

NOTICE TO 4TH DEFENDANT

To
P. CHANDRAIAH NAIDU
S/o P.Narayanaswamy Naidu, Hindu, aged about 68 years, Cultivation, residing at D.No.2-925, Seshapillar Road, Kongareddipalli, Chittoor, Chittoor District

Sir, Whereas the above plaintiff filed the above suit in OS No. 482 of 2015 you as 4th defendant in the above suit. The above said suit stands posted to **22-10-2024** for your notice and appearence before the said court, please be present at about **10.30 AM** on the said date either in person, or through an Advocate failing which, the matter will be decided in your absence.

Hearing Date : 22-10-2024

(Sri D.JANARDHANA NAIDU)
Advocate,Chittoor
Cell :9440958395